ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం : సీపీఎం

మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

మోత్కూరు, అక్టోబర్ 7 : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండలంలోని పాలడుగు గ్రామంలో సోమవారం జరిగిన పార్టీ మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినా కేంద్ర ప్రభ్వం డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించకపోవడంతో ఆయిల్ కంపెనీలు ప్రజల నుంచి కోట్ల రూపాయలను దండుకుంటున్నాయన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గకపోవడం వల్ల నిత్యావసరాలు, కూరగాయలు, ఆహార ధాన్యాలు ధరలు తగ్గడం లేదని తెలిపారు. ఆయిల్ కంపెనీల లాభాల కోసం మోదీ ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతున్నదని విమర్శించారు. పసునూరి చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరాజు, కె.మల్లేశం, బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు పైళ్ల యాదిరెడ్డి, రాములమ్మ, ప్రభాకర్, యాదయ్య పాల్గొన్నారు.

సంచార జాతులను ఆదరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మందుల కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుడ్డ యాదగిరి

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 7 : రాష్ట్రంలో వెనుకబడిన సంచార జాతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మందుల కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్నబత్తిని బుడ్డ యాదగిరి కోరారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సంచార జాతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంచార జాతులను 40 సంవత్సరాలుగా పాలకులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సంచార జాతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంచార జాతుల సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంచార జాతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు.

పోచంపల్లిలో సంచార జాతులకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలి

బీమా చెక్కులు అందజేస్తున్న పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ రమేశ్

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 7 : బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలని పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పట్టణ కేంద్రంలోని కప్పర వెంకటయ్య, మహేశ్వరం దత్తాత్రేయ కుటుంబాలకు న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ సౌజన్యంతో జీజేపీఏ పాలసీ కింద లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, సీఈఓ సీత శ్రీనివాస్, డైరెక్టర్లు బాలసుబ్రమణ్యం, హరిశంకర్, రమేశ్, వేణు, కావ్య, భార్గవి, ఎల్లస్వామి, నర్సింహా, భాస్కర్, సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్, బ్రాంచ్ మేనేజర్ రచ్చ శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

'థ్రిఫ్ట్ డబ్బును బ్యాంకు ఖాతాలో జమ చేయాలి'

జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ మహమ్మద్ కామిల్‌ను కలిసిన చేనేత కార్మిక సంఘ నాయకులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 7 : చేనేత చేయూత పథకం డబ్బులను కార్మికుల బ్యాంకు ఖాతాలో త్వరగా జమ చేయాలని పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు అన్నారు. ఈ మేరకు జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ మహమ్మద్ కామిల్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచంపల్లి కెనరా, ఎస్బీఐ బ్యాంక్లలో డాటా పెండింగ్ ఉన్నాయని, వెంటనే బ్యాంకు డేటాను పంపాలని కోరారు. చేనేత కార్మికులకు థ్రిఫ్ట్ డబ్బును వెంటనే ఖాతాలో జమ చేయాలని కోరారు. ఆయన వెంట కార్మిక సంఘం ఉపాధ్యక్షులు భారత భూషణం, ప్రధాన కార్యదర్శి బొమ్మ హరిశంకర్, సహాయ కార్యదర్శి బిట్ల గణేశ్, కోశాధికారి రుద్ర సూర్యప్రకాశ్, డైరెక్టర్లు పొట్టబత్తిని వేణుకుమార్, కటకం శ్యాంసుందర్, గుండేటి శివరాజు, కూరపాటి భాస్కర్, గుండు రాజేశ్వరి, గుర్రం హేమలత పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారులుగా పదోన్నతి కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న దాసరి వీరన్న

మోత్కూరు, అక్టోబర్ 7 : తమకు గ్రామ రెవెన్యూ అధికారులుగా పదోన్నతి కల్పించాలని తెలంగాణ రికార్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి వీరన్న డిమాండ్ చేశారు. మోత్కూరులో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం 2700 మంది వీఆర్ఏలను వివిధ శాఖల్లో రికార్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త రెవెన్యూ చట్టంలో తమను గ్రామ రెవెన్యూ అధికారులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిత్తలూరి స్వామి, బుంగ చరణ్, ఈదుల బాలస్వామి, బాదె భాస్కర్, బైరబోయిన మల్లేశ్, సంగెం పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

ఆలేరు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ ఎంఎల్, సీపీఐ ప్రజాఫ్రంట్ నాయకులు

ఆలేరు టౌన్, అక్టోబర్ 7 : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని ఆలేరులో జాతీయ రహదారిపై సీపీఐ (ఎం ఎల్), సీపీఐ ప్రజాఫ్రంట్ నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణ, దుర్మార్గపు దాడులతో వేల సంఖ్యలో పసిపిల్లలు, పౌరులు మరణిస్తున్నారని తెలిపారు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద దేశాల కనుసన్నల్లో సాగుతున్న ఇజ్రాయిల్ హత్యాకాండను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎం.ఎల్, సీపీఐ ప్రజాఫ్రంట్ నాయకులు ఆర్.జనార్దన్, అడివయ్య, ఉప్పలయ్య, వెంకటేశ్, యాదయ్య, కుమార్, నాగరాజు, మహేశ్, స్వామి, రవి, శ్రీనివాస్, ఐలయ్య, మురళి, ప్రవీణ్ పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

రాజాపేట, అక్టోబర్ 7 : మండలంలోని బొందుగుల గ్రామ సమీపంలో సోమవారం కారు, బైక్ ఢీకొనగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న సిద్ధిపేట జిల్లా అక్కారం గ్రామానికి చెందిన ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రాజాపేట ప్రాథమిక దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్య కోసం గజ్వేల్ దవాఖానకు తీసుకెళ్లారు

వైభవంగా యాదగిరీశుడి తిరు కల్యాణోత్సవం

స్పటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పురోహితులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు జోడుసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటిక లింగేశ్వరుడికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.18,79,262 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

హమాలీలకు ఉపాధి కల్పించాలి

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు, ఏఐటీయూసీ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 7 : సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ద్వారా వచ్చే ప్రొక్యూర్‌మెంట్ బియ్యాన్ని యథావిధిగా పట్టణంలోని మార్కెట్ యార్డుకు వచ్చేలా మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీ కార్మికులకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. 11సంవత్సరాలుగా మార్కెట్ యార్డులో బియ్యం దిగుమతి చేస్తున్నారని, ఇప్పుడు పురుగుల సాకుతో బియ్యం రాకుండా చేసి కార్మికుల ఉపాధి దెబ్బతీయొద్దని అన్నారు. పురుగులు రాకుండా ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్ మేనేజర్ లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని తెలిపారు. కరోనా నుంచి మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు నిలిపివేశారని, ఇప్పుడు బియ్యం కూడా రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భువనగిరిలో బీహార్, ఇతర రాష్ట్రాల కూలీలు తక్కువ వేతనానికి పనిచేయడంతో స్థానిక హమాలీలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. భువనగిరి కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులో బియ్యం దిగుమతి చేసేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేశ్, కార్యవర్గ సభ్యుడు శోభన్‌బాబు, హమాలీ సంఘం నాయకులు నర్సింహ, రమేశ్, ఐలయ్య, బొజ్జయ్య, మల్లేశ్, చంద్రయ్య, బాలనర్సింహ, కృష్ణ, జగన్, వెంకటేశ్, లింగస్వామి, ధర్మయ్య పాల్గొన్నారు.

ఇద్దరు నిందితులకు ఏడేండ్ల జైలు శిక్ష

భువనగిరి అర్బన్, అక్టోబర్ 7 : అక్రమ ఆయుధాలు కలిగిఉన్న కేసులో ఇద్దరు నిందితులకు ఏడేండ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.5వందల చొప్పున జరిమానా విధిస్తూ భువనగిరి కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. ఖమ్మం జిల్లా కొత్త పాల్వంచ కేంద్రంలోని వెంగళ్‌రావు కాలనీకి చెందిన వనపాకుల రాంబాబు, వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్నం గ్రామానికి చెందిన పిట్టల శ్రీనివాస్ 2017లో ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఆయుధాలు కలిగి ఉండి ఇతరులను బెదిరించి డబ్బు వసూలుకు పాల్పడ్డారు. ఈ కేసులో వారిని ఆలేరు పట్టణ పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. కేసు విచారణలో భాగంగా సోమవారం భువనగిరి కోర్టులో హాజరు పరుచగా ఏడేండ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది.

యువకుడి ఆత్మహత్య

బీబీనగర్, అక్టోబర్ 7 : మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్‌కుంద గ్రామానికి చెందిన జీరిగె సునీల్‌కుమార్ (34) 15సంవత్సరాలుగా మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ సమీపంలోని పాల డెయిరీలో కూలి పని చేస్తూ జీవనం గడుపుతున్నాడు. కాగా, కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సునీల్‌కుమార్ ఆదివారం రాత్రి అద్దెకు ఉన్న ఇంట్లో ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా అనంతరం మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి సోదరుడు సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదగిరిగుట్టలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట, అక్టోబర్ 7 : యాదగిరిగుట్టలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గుండ్లపల్లి పరిధిలో గల నల్ల చెరువులో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం తేలియాడుతుండగా స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని బయటికి తీసి పరిశీలించారు. 40 నుంచి 45 ఏండ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం ముఖం ఉబ్బి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నదని తెలిపారు. నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఎడమ చేతిపై ఎమ్మెల్యే అని పచ్చబొట్టును గుర్తించామని, చెవులకు రింగ్స్ కలిగి ఉన్నాడని చెప్పారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. ఆచూకీ తెలిసిన వారు యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆవులను తరలిస్తున్న వాహనం సీజ్

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 7 : గోవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మండలంలోని లక్కారం గ్రామ స్టేజీ వద్ద చౌటుప్పల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. విశాఖపట్నం జిల్లా నక్కలపల్లి మండలం దేవవరం గ్రామానికి చెందిన బత్తుల గోపి యాదవ్ (34), కోన తోటబ్బాయాదవ్ (20) కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో 14 ఆవులు, 4ఎద్దులను కొనుగోలు చేసి వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు చౌటుప్పల్ మండలం లక్కారం గ్రామం వద్ద వారిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చౌటుప్పల్ సబ్ ఇన్‌స్పెక్టర్ యాదవరెడ్డి తెలిపారు.

మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

మహాలక్ష్మిగా పర్వతవర్ధినీ

యాదగిరిగుట్ట, అక్టోబర్ 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఐదో రోజు సోమవారం అమ్మవారికి ఉదయం పాతఃకాల పూజ, అర్చనలు, పారాయణాలు, గాయత్రీ జపాలు నిర్వహించారు. లలితా సహస్రనామార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద వితరణ గావించారు. సాయంత్రం శ్రీదేవికి నవావరణ పూజ, సహస్రనామార్చన, నీరాజనం మంత్రపుష్పం చేపట్టి తీర్థప్రసాద వితరణ చేపట్టారు. పర్వతవర్ధినీ అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు.

దైవ సంకల్పంతోనే సర్వం సాధ్యం : రమణానందమహర్షి

రమణేశ్వరంలో శ్రీచక్ర ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 7 : దైవ సంకల్పంతోనే సర్వం సాధ్యపడుతుందని సిద్ధగురువు రమణానందమహర్షి ఉద్బోధించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో దేవీ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చేపడుతున్న శ్రీచక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా సోమవారం యంత్ర ప్రతిష్ఠ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడు చేపట్టే ప్రతి పనికీ దైవానుగ్రహం తప్పనిసరి అన్నారు. నిత్యం దైవ నామ స్మరణతో ఎంతో ఆత్మసిద్ధి సంప్రాప్తిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి అధికారులంతా హాజరు కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాజారాం

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 7 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరు కావాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా గ్రామ ప్రత్యేకాధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామాన్ని పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రాములునాయక్, డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ మహదేవరెడ్డి, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, పీఆర్ ఏఈ సునీత, ఏపీఓ రమేశ్, ఏపీఎం కిరణ్ పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన నీరందించాలి : సీపీఐ

పార్టీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

వలిగొండ, అక్టోబర్ 7 : విషతుల్యంగా మారిన మూసీ నదిని ప్రక్షాళన చేసి పంటలకు స్వచ్ఛమైన సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని వేములకొండ గ్రామంలో సోమవారం నిర్వహించిన పార్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే మూసీ ప్రక్షాళన చేసి దిగువ ప్రాంత గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగు, సాగునీరందించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు యానాల దామోదర్ రెడ్డి, బోడ సుదర్శన్, పోలెపాక యాదయ్య, యాస జనార్దన్‌రెడ్డి, సలిగంజి వీరస్వామి, మహేశ్, రవీందర్, మల్లేశ్, సత్యనారాయణ, అంజయ్య, యాదయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

కేజీబీవీలో డే వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తులు

బొమ్మలరామారం, అక్టోబర్ 7 : మండలంలోని మల్యాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న డే వాచ్ ఉమెన్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ డి.రోజారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగి, పదో తరగతి విద్యార్హతతోపాటు ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీలో శిక్షణ పొంది ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థుతమ దరఖాస్తులను కేజీబీవీలో మంగళవారం సాయత్రంలోపు అందజేయాలని సూచించారు.

6నెలల్లో బునాదిగాని కాల్వ ద్వారా సాగునీరు అందిస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 7 : ఆరు నెలల్లోగా మండలంలోని 22 గ్రామాలకు బునాదిగాని కాల్వ ద్వారా గోదావరి జలాలను అందించి సాగునీటి సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకుంటామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఆలేరు నియోజకవర్గంలోని బిక్కేరు వాగులోకి గోదావరి జలాలు అందివ్వడంతో రైతులు సంబురాలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

నెల రోజుల పాటు గోదావరి జలాలను బిక్కేరు వాగులో ప్రవహించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ మంగమ్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ నరేందర్ గుప్తా, మాజీ సర్పంచ్ నగేశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రఘునాథపురం శివాలయంలో దుర్గామాతకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీత

రాజాపేట, అక్టోబర్ 7 : ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రఘునాథపురంలో శివాలయం, రామాలయంతోపాటు రాజాపేటలో నెలకొల్పిన దుర్గామాత మండపాల్లో సోమవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెను దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, నాయకులు గుర్రం నర్సింహులు, రామిండ్ల నరేందర్, కటకం స్వామి, డొంకెన మహేందర్‌గౌడ్, వెంకటేశం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

రాజాపేట, అక్టోబర్ 7 : ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మండలంలోని బేగంపేట గ్రామంలో 216 సర్వే నెంబర్‌లోని భూమిని షాషా ప్రాపర్టీస్ ప్రైవేటు కంపెనీ వారు కబ్జా చేశారని గ్రామ రైతుల ఫిర్యాదు చేయగా.. తాసీల్దార్ దామోదర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం అనుమతులు లేకుండా పనులు నిర్వహిస్తున్నదని, విచారణ పూర్తయ్యే వరకు పనులు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సర్వే నిర్వహిస్తామని, ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే స్వాధీనం చేసుకుంటామని తాసీల్దార్ దామోదర్ అన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ గిరధర్, ఆర్ఐ రమేశ్, రైతులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, మల్లేశం

ఆలేరు టౌన్, అక్టోబర్ 7 : మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ మండల